# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 30, జులై 2026




### ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను

# నిశితంగా పర్యవేక్షించాలి

### + రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



నస్పూర్, జూలై 29, ప్రభాతవార్త

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను బి.ఎల్.ఓ. సూపర్వైజర్లు, ఏ.ఈ.ఆర్.ఓ.లు, ఈ.ఆర్.ఓ.లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను నియమ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఒక కుటుంబానికి సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి ఉండేలా హేతుబద్ధీకరణను చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, వాటికి సంబంధించిన వివరాలు డాక్యుమెంటేషన్ చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. జాబితా తయారు చేసిన తరువాత సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యువరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 81 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సమన్వయంతో ప్రక్రియ వేగవంతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ✣ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్, జులై 29, ప్రభాతవార్త :

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల దృష్ట్యా జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. బుధవారం ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి, గుండి వాగులను పరిశీలించారు. పోలీస్, రెవెన్యూ సిబ్బందికి వరద తగ్గిన తర్వాతనే ప్రజలు దాటేందుకు అనుమతి ఇవ్వాలని, వరద అధికంగా ఉన్న సమయంలో రాకపోకలు నిలిపివేయాలని, భద్రత చర్యలకు సంబంధించిన సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రానున్న నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వాగులు, వంకలు, చెరువులు, నదులు, కల్వర్టులు, లోలెవల్ బ్రిడ్జిల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రయాణాలు చేయవద్దని, పోలీసు శాఖ ప్రజల భద్రత కోసం వరద ప్రభావిత ప్రాంతాలు, లోలెవల్ బ్రిడ్జిల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

# వర్షపాతం, భూగర్భ జలాల డేటా కచ్చితంగా ఉండాలి

### వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాలు పూర్తి చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, జులై 29, ప్రభాతవార్త:

జిల్లావ్యాప్తంగా వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వనమహోత్సవం, జలసిరి ఫామ్ పాండ్‌లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ పట్టణ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని భూగర్భ జలాల కొలతల కేంద్రాన్ని, అక్కాపూర్ గ్రామంలోని వర్షపాత మాపక కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా శాస్త్రీయ ప్రమాణాలతో డేటాను నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎల్లపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయ పనులను పరిశీలించి, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వనమహోత్సవ లక్ష్యాలను శాఖల వారీగా పూర్తి చేయాలని, ఫామ్ పాండ్‌లు, బోరు రీచార్జ్ మిగతా 2లో..

# ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణను ఆకస్మికంగా పరిశీలించిన ఐటీడీఏ పీఓ

ఆసిఫాబాద్ టౌన్, జూలై 29, ప్రభాతవార్త



కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు బుధవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. శిక్షణ రెండో రోజు నిర్వహించిన ప్రతి సబ్జెక్టు తరగతిని ఆయన స్వయంగా సందర్శించి, సుమారు గంటసేపు ఉపాధ్యాయులతో కలిసి కూర్చొని శిక్షణా విధానాన్ని పరిశీలించారు. శిక్షకులు బోధిస్తున్న అంశాలను ఆసక్తిగా విన్న ఆయన ఉపాధ్యాయులతో పరస్పరం చర్చిస్తూ బోధనలో నాణ్యత, వినూత్న బోధనా పద్ధతుల అమలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలపై పలు సూచనలు చేశారు. శిక్షణను కేవలం హాజరు కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఉపాధ్యాయుడి వృత్తి నైపుణ్యాలను పెంపొందించే మిగతా 2లో..

# వర్షపాతం, భూగర్భ జలాల డేటా కచ్చితంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

పిట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎల్3 జాబితాలోని నిజమైన అర్హులను పారదర్శకంగా ధ్రువీకరించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు, వాగుల వద్దకు వెళ్లకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీవో గంగారెడ్డి, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణను ఆకస్మికంగా పరిశీలించిన ఐటీడీఏ పీఓ

(మొదటిపేజీ తరువాయి)

అవకాశంగా భావించి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, పీఎంఆర్సీ ఏసీఎంఓఎస్ ఆసిఫాబాద్, మంచిర్యాల పూర్కా ఉద్ధవ్, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, కోర్సు డైరెక్టర్ కె. రవీందర్, ప్రధానోపాధ్యాయులు లింభారావు, ఆర్పీఎస్ శిక్షణ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వరదపై పోలీసుల క్షణక్షణం నిఘా...

**- ముంపు ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్ స్వయంగా పర్యవేక్షణ**

**- రాళ్లవాగు వద్ద పరిస్థితుల సమీక్ష... - ప్రమాదకర ప్రాంతాల్లో రాకపోకలకు ఆంక్షలు**

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి**

మంచిర్యాల, జూలై 29, ప్రభాతవార్త

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు రామగుండం పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల రాళ్లవాగు ప్రాంతాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్వయంగా పరిశీలించి వరద పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోందని, దీంతో పాత మంచిర్యాల ప్రాంతానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రమాదకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ వరద ప్రవాహాలు, వాగులు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు వేగవంతం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా కోటపల్లి, నీల్వాయి ప్రాంతాల వైపు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైతే రాష్ట్ర విపత్తు స్పందన దళాలను మోహరించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది అత్యవసర సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ఏడాది వరదల సమయంలో గ్రామాలు నీటిలో చిక్కుకున్నప్పుడు బోట్ల ద్వారా విజయవంతంగా సహాయక చర్యలు చేపట్టిన అనుభవంతో ఈసారి కూడా ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందించేలా పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ అందుబాటులో ఉన్నారని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు తదితరులు పాల్గొన్నారు.





# చెన్నూరులో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**- జ్యోతిష్యులు దత్తాత్రేయ శర్మను సత్కరించిన భాజపా నాయకులు**

చెన్నూరు, జూలై 29, ప్రభాతవార్త

చెన్నూరు పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలు భాజపా ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పంచాంగ కర్త జ్యోతిష్యులు దత్తాత్రేయ శర్మను భాజపా నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ పంచాంగ కర్తలు హిందూ సమాజ మార్గదర్శకులని అన్నారు. పంచాంగం అనేది కేవలం తిథులు, నక్షత్రాలు తెలిపే గ్రంథం మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, ఖగోళ విజ్ఞానం, ధార్మిక సంప్రదాయాలకు అద్దం పట్టే మహాగ్రంథమని అన్నారు. ప్రముఖ పంచాంగ రచయితలలో ఒక రైనా కోమ్మెర దత్తాత్రేయ శర్మ చెన్నూరు వాస్తవ్యులు కావడం మా అందరికీ గర్వకారణం అన్నారు. గురు పౌర్ణమి రోజున జ్ఞానాన్ని పంచే గురువులను ఎంత గౌరవిస్తామో, జ్ఞాన సంప్రదాయాన్ని పరిరక్షిస్తున్న పంచాంగ కర్తలను కూడా అంతే గౌరవించాలనీ, వారి కృషి వల్లే మన సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలకు సజీవంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ జిల్లా కో కన్వీనర్ పొన్నం లస్మా గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఏతం శివకృష్ణ, కౌన్సిలర్ గర్రెపెల్లి శాంత వెంకట నర్సయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కాయిత వెంకటేష్, బిజెపి నాయకులు లీగల్సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ మద్ది కార్తీక్, బిజెపి నాయకులు ప్రసాద్ తుమ్మ చిరంజీవి, అడప శ్రీనివాస్, చకేటి శ్యామ్, చటారి వెంకటేష్, గణేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేని వర్షం..

# స్తంభించిన జనజీవనం

తాండూర్, జులై 29, ప్రభాతవార్త :

మండలంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాల కారణంగా నర్సాపూర్ గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగి కల్వర్టు పైనుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో గిరిజనుల రాకపోకలు నిలిచిపోయాయి. నీలాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెర కాలనీకి చెందిన కన్నవేని తిరుపతి ఇల్లు శిథిలావస్థలో ఉండడంతో ముందు జాగ్రత్తగా మాదారం ఎస్సై సౌజన్య, స్థానిక సర్పంచ్ పోలవేణి తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు వారి కుటుంబాన్ని పునరావాస కేంద్రానికి తరలించారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని పలు రహదారులపై నుంచి వరద నీరు ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం, రోడ్లు బురదమయంగా మారాయి. వర్షాల కారణంగా రైతుల పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయారు. ఎగువ ప్రాంతాల కురిసిన వర్షాలతో చెరువులలోకి వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. భారీ వర్షాలతో వాగులు, ఒర్రెలు పొంగి వరదనీరు ప్రవహిస్తే ప్రజలు, వాహనదారులు దాటకూడదని అధికారులు సూచించారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇళ్లకే పరిమితం అయ్యారు. అత్యవసర పనులు ఉంటేనే బయటకు వెళ్లాలని, లోతట్టు ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసులు అధికారులు హెచ్చరించారు.



ఉప్పొంగి ప్రవహిస్తున్న నరసాపూర్ వాగు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి

## బాసర క్షేత్రంలో వైభవంగా

# వ్యాస పూర్ణిమ వేడుకలు

**- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, వేణుగోపాలాచారి**

భైంసా, జులై 29, ప్రభాతవార్త:

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో వ్యాస పూర్ణిమ వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం వ్యాస పూర్ణిమను పురస్కరించుకుని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వారు వ్యాసలయంలో పూజలు చేసి, వేద పండితులు చేపట్టిన యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శేషవస్త్రాలతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో

# బీసీ బిల్లు ఆమోదించాలి

**- తెలంగాణ బీసీ ఉద్యమ నేత సుంకేట పోశెట్టి డిమాండ్**

భైంసా, జులై 29, ప్రభాతవార్త:



ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ఆమోదం పొందేలా ప్రతిపక్షాలు గళం విప్పాలని తెలంగాణ బీసీ ఉద్యమ వేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకేట పోశెట్టి పిలుపునిచ్చారు. బుధవారం భైంసా పట్టణంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి ఆమోదించాలని, చట్టసభల్లో బీసీ, ఎంబీసీలకు 60 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కేంద్ర అధికార పార్టీపై ఒత్తిడి పెంచాలని కోరారు. బీసీ బిల్లు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో వాటిని గద్దె దించడం ఖాయమని హెచ్చరించారు.

# రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఏఈ దీక్షిత్ సూచన**

వేమనపల్లి, జూలై 29, ప్రభాతవార్త

వేమనపల్లి మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ కోరారు. వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలను నిర్లక్ష్యంగా ముట్టుకోవడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. బోర్ మోటార్లు, స్టార్టర్లు, ఫ్యూజ్ బాక్సులు, విద్యుత్ వైర్లు తదితర పరికరాలకు స్వయంగా మరమ్మతులు చేయరాదని సూచించారు. పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ తీగలు, స్తంభాల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని, తడిసిన చేతులతో లేదా తడి వస్తువులతో విద్యుత్ పరికరాలను తాకరాదని తెలిపారు. ఇంట్లో విద్యుత్ సంబంధిత మరమ్మతులు అవసరమైతే అనుభవం కలిగిన ఎలక్ట్రీషియన్‌తోనే చేయించుకోవాలని, విద్యుత్ లైన్ల కింద పశువులను కట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగి పడినట్లు గమనించినా లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఫిర్యాదుల కోసం నీల్వాయి సబ్‌స్టేషన్ 8712484140, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ 8712484155 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# అన్‌ఫిట్ కార్మికులపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

**- 2025-26 ఆర్థిక సంవత్సర లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి - కొత్త బొగ్గు బ్లాక్‌లన్నీ సింగరేణికే కేటాయించాలి**

**- ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేసిన హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి సాజన్**

మందమర్రి, జూలై 29, ప్రభాతవార్త:

సింగరేణి కార్మికుల అన్‌ఫిట్ సమస్య, కార్మికులకు లాభాల్లో వాటా, సింగరేణి సంస్థ భవిష్యత్తు, కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి సాజన్ డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రిలో హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్‌ఫిట్ కార్మికులకు న్యాయం చేయాలిసింగరేణిలో మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికుల ఆరోగ్య పరిస్థితిని వాస్తవికంగా, నిష్పక్షపాతంగా పరిశీలించి న్యాయం చేయాలని సాజన్ కోరారు. హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన బాయిబాట కార్యక్రమం, నిరవధిక నిరాహార దీక్ష హెచ్చరికల ఫలితంగానే యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించిందన్నారు. అయితే మెడికల్ బోర్డు నిర్వహించడం మాత్రమే కాకుండా, తీవ్ర అనారోగ్యం లేదా శారీరక వైకల్యంతో బాధపడుతున్న కార్మికుల పరిస్థితిని మానవతా దృక్పథంతో అంచనా వేయాలని సూచించారు. కాశీపేట-1 గనికి చెందిన ఒక కార్మికుడు కాలును పూర్తిగా కోల్పోయినా ఫిట్‌గా ప్రకటించి సర్ఫేస్ విధులకు పంపడం బాధాకరమని పేర్కొన్నారు. ఇటువంటి నిర్ణయాలను పునఃసమీక్షించి కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్మికుల శారీరక సామర్థ్యం, వైద్య పరిస్థితి, వారు నిర్వర్తించే పనుల స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

### కార్మికుల కష్టానికి తగిన లాభాల వాటా ఇవ్వాలి:

సింగరేణి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి లాభనష్టాల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సాజన్ డిమాండ్ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 62 మిలియన్ టన్నుల డిస్పాచ్ నమోదైందని, కార్మికుల ఉత్పాదకత కూడా 5.5 టన్నుల నుంచి 7.5 టన్నులకు పెరిగిందని



తెలిపారు. ఈ ఫలితాలన్నీ కార్మికుల నిరంతర శ్రమ, అంకితభావం, త్యాగాల వల్లే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికుల కృషికి తగిన గుర్తింపుగా లాభాల్లో వాటా పెంచాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరంలో కార్మికులకు 34 శాతం లాభాల వాటా అందించిన నేపథ్యంలో, ఈ ఏడాది అంతకంటే మెరుగైన వాటా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సంస్థకు వచ్చిన మొత్తం లాభాలు, ప్రభుత్వానికి చెల్లించిన వాటా, సంస్థ అభివృద్ధికి కేటాయించిన నిధులు, కార్మిక సంక్షేమంపై చేసిన వ్యయం వంటి అన్ని వివరాలను యాజమాన్యం పారదర్శకంగా వెల్లడించాలని కోరారు.

### కొత్త బొగ్గు బ్లాక్‌లన్నీ సింగరేణికే కేటాయించాలి:

తెలంగాణలో కొత్తగా గుర్తించిన అన్ని బొగ్గు బ్లాక్‌లను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని సాజన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని కోరుతున్న సమయంలో వేలం నిర్వహించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన జెన్‌కో సంస్థ వేలంలో పాల్గొనడం వెనుక ఉద్దేశాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన మరో సంస్థ సింగరేణికి పోటీగా నిలవడం సరికాదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకుని జెన్‌కో వేలంలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచర్ల బ్లాక్‌ను కేటాయించిన విధంగానే మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

### సింగరేణి భవిష్యత్తు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే:

సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిందని సాజన్ అన్నారు. కార్మికుల హక్కులు, సంస్థ భవిష్యత్తు, తెలంగాణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం హెచ్ఎంఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుదర్శన్, కేంద్ర కార్యదర్శి నాగనవేణి హరీష్, ఏరియా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నవీన్, జాయింట్ సెక్రటరీ నీరటి కార్తీక్, హర్షవర్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గౌతం, శ్రావణ్, జబీర్, కోశాధికారి శ్రావణ్, కాశీపేట-1 ఫిట్ సెక్రటరీ ప్రీత్ పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



వర్షపు నీటి నిల్వల ప్రాంతాలను పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్న మేయర్ ధర్ని మధుకర్



# ముంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన మంచిర్యాల మేయర్

**- డ్రైనేజీల్లో నీటి మళ్లింపునకు చర్యలు.. అధికారులకు అప్రమత్తత ఆదేశాలు**

నస్పూర్, జూలై 29, ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నీటి నిల్వలు ఏర్పడిన ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిపోయిన రహదారులు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల పరిస్థితిని స్వయంగా తనిఖీ చేసి, నీటి పారుదల వేగవంతం అయ్యేలా తక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ తిరుమల టౌన్‌షిప్, 32వ డివిజన్ రాంనగర్ ఆదిపరాశక్తి దేవాలయం వద్ద వాగులు, డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో, జేసీబీ సహాయంతో తక్షణమే పూడిక తొలగించి నీటిని సురక్షితంగా మళ్లించే ఏర్పాట్లు చేశారు. స్థానిక ప్రజల నుంచి సమస్యలపై సమాచారం అందగానే స్పందించిన మేయర్, స్వయంగా ఆయా డివిజన్లలో పర్యటిస్తూ మున్సిపల్ అధికారులను, పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. వర్షాకాలంలో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు నిరంతరం వేగవంతమైన సేవలు అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుడు మరణానికి బాధ్యులెవరు?

## - కార్డియాలజిస్ట్ లేక కార్మికుడు మృతి

**బెల్లంపల్లి, జూలై 29, ప్రభాతవార్త**



బెల్లంపల్లి శాంతిఖని గనిలో పనిచేస్తున్న కార్మికుడు బి.రవి కుమార్ మృతి ఘటన సింగరేణి వైద్య వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈరోజు ఉదయం ఛాతినొప్పితో బాధపడుతున్న రవికుమార్‌ను ఉదయం 7:25 గంటల ప్రాంతంలో బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రికి తరలించగా, అక్కడ సరైన అత్యవసర వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల ఆయన ప్రాణాలు కోల్పోయారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలో ఈసీజీ చేసి మూడు ఇంజెక్షన్లు ఇచ్చిన వైద్యులు, వెంటనే మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగింది. అయితే, అక్కడికి చేరుకునేలోపే రవికుమార్ మృతి చెందడం గమనార్హం. సమయానికి కార్డియాలజిస్ట్ ఉంటే ప్రాణం నిలిచేదా? అనే ప్రశ్న ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్ లేకపోవడం, రెగ్యులర్ డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. వారానికి ఒకరోజు మాత్రమే వచ్చే స్పెషలిస్టులతో ఆసుపత్రి నడపడం ప్రజల ప్రాణాలతో ఆటలాడటమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని నెలల క్రితం ఆసుపత్రి అభివృద్ధిపై పెద్దఎత్తున హామీలు ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు వాటిని అమలు చేయకపోవడం మరింత ఆగ్రహానికి దారితీసింది. రెండు సంవత్సరాల క్రితం జరిగిన చర్చల తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడం పట్ల స్థానికులు, కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై జేఏసీ నాయకులు సింగరేణి యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రవికుమార్ మరణానికి పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాలి అని డిమాండ్ చేశారు. వెంటనే న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఇంకా సంచలన ఆరోపణగా, రవికుమార్ మృతి బెల్లంపల్లి ఆసుపత్రిలోనే జరిగి ఉండవచ్చని, బాధ్యత తప్పించుకునేందుకు మంచిర్యాలకు తరలించారని స్థానికులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని బెల్లంపల్లి కాకుండా మంచిర్యాల సివిల్ ఆసుపత్రికి తరలించడం కూడా అనుమానాలకు తావిస్తోంది. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే సింగరేణి ఆసుపత్రి ఎదుట భారీ ఆందోళనలు చేపడతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా టిఎస్టియుసి రాష్ట్ర కార్యదర్శి టి. మనిరామ్ సింగ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజ్జి దుర్గయ్య, ఎస్సికెఎస్ రాష్ట్ర నాయకుడు అంబాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఒక కార్మికుడి ప్రాణం కోల్పోవడం వెనుక ఉన్న నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎడతెరిపి వర్షాలతో స్తంభించిన ఓపెన్‌కాస్ట్ బొగ్గు ఉత్పత్తి

**మందమర్రి, జూలై 29, ప్రభాతవార్త**

మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మందమర్రి పరిధిలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వర్షాల కారణంగా గనుల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణా పనులకు అంతరాయం ఏర్పడింది. ప్రత్యేకించి కల్యాణిఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో గని పరిసర ప్రాంతాలు, అంతర్గత రహదారులన్నీ బురదమయంగా మారడంతో డంపర్లు, భారీ వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో తవ్వకం, బొగ్గు రవాణా పనులు దాదాపు నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. వర్షాల ప్రభావంతో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే కొన్ని వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడినట్లు సమాచారం. వర్షం తగ్గిన తర్వాతే పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని గని వర్గాలు పేర్కొంటున్నాయి. వర్షాలు కొనసాగితే బొగ్గు ఉత్పత్తిపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉత్పత్తి లక్ష్యాల సాధనపై కూడా ప్రభావం చూపే అవకాశముందని తెలుస్తోంది.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు

### - నిలువ నీడ కోల్పోయిన కుటుంబం

**మందమర్రి, జూలై, ప్రభాతవార్త**



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మందమర్రి పట్టణంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని వెంకటేశ్వర టెంపుల్ ఏరియాలో ఓ నిరుపేద మహిళ నివాసం పూర్తిగా కూలిపోవడంతో ఆమె కుటుంబం నిలువ నీడ కోల్పోయింది. బాధితురాలు అయిల్ల కనకలక్ష్మి మందమర్రి మార్కెట్ ప్రాంతంలో చపాతీలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. భర్త మృతి చెందడంతో కుమారుడితో కలిసి అత్యంత నిరుపేద పరిస్థితుల్లో జీవిస్తున్న ఆమెకు భారీ వర్షం మరింత కష్టాలను మిగిల్చింది. ఇంటి పైకప్పు, గోడలు పూర్తిగా కూలిపోవడంతో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఘటన సమయంలో ఇంట్లో ఉన్న కనకలక్ష్మి ప్రాణాపాయం నుంచి తృటిలో బయట పడినప్పటికీ, ఒక్కసారిగా నివాసాన్ని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో నిలిచింది. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ రాజలింగు, పట్టణ ఎస్ఐ జి. నరేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని అంచనా వేశారు. ఘటనకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించి బాధిత కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరుపేద కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం, ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూలై 29, ప్రభాతవార్త**



జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించిన జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, ఎయిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ చర్యలను మరింత పటిష్టం చేసి, జిల్లాలో స్క్రీనింగ్ సేవలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో బహుళ రంగాల కార్యాచరణ వ్యూహం లక్ష్యాలను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని సూచించారు. చికిత్స పరిధిలోకి రాని హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించడంతో పాటు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన బహిరంగ ప్రదేశాలలో స్వీయ ప్రమాద అంచనా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి స్వచ్ఛంద పరీక్షలను ప్రోత్సహించాలని, తద్వారా ప్రజలు ప్రమాదాన్ని అంచనా వేసుకుని సమీపంలోని పరీక్షా కేంద్రాలకు స్వయంగా వెళ్తారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ కార్మికులు, అధిక ప్రమాదం ఉన్న కార్మిక వర్గాల కోసం ప్రత్యేక ఆరోగ్య, హెచ్ఐవి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సామాజిక సంరక్షణ, మద్దతు, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హెచ్ఐవి బాధితుల సంక్షేమానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారులు సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌ల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఎయిడ్స్ బాధితుల సహాయార్థం, ప్రజల సౌకర్యం కొరకు టోల్ ఫ్రీ నంబర్ 1097 ఏర్పాటు చేయడం జరిగిందని, సందేహాల నివృత్తి, సమాచారం కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలో హెచ్ఐవి నియంత్రణ చర్యల పురోగతిని వివరించారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు సేవలు మరింత చేరువయ్యేలా చెన్నూర్‌లో నూతన ఐసీటీసీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, లింక్ ఆర్ట్ సెంటర్ సిబ్బంది, హెచ్ఐవి పాజిటివ్ నెట్‌వర్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## విత్తన మేళాను సద్వినియోగం చేసుకోండి

### - జిల్లా వ్యవసాయ అధికారిణి సురేఖ

**చెన్నూరు, జూలై 29, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కిష్టంపేట రైతువేదికలో నిర్వహిస్తున్న విత్తన మేళాను జిల్లా వ్యవసాయ అధికారిని సురేఖ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట మార్పిడి దిశగా రైతులు పప్పు దినుసులు, కూరగాయలు, నూనె గింజలు పండించాలని తెలిపారు. ఇందులో భాగంగా విత్తన మేళాలో కంది 4 కిలోల బ్యాగ్ 520 రూ. పెసర 4 కిలోల బ్యాగ్ 544 రూ. అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని యామిని, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.





## వర్షం వస్తే కామాఖ్య ఆలయానికి నో ఎంట్రీ

### - ఉప్పొంగిన వాగుతో నిలిచిన భక్తుల రాకపోకలు
### - వాగుపై వంతెన లేక భక్తుల అవస్థలు
### - ఏళ్లుగా వినతులు ఇచ్చినా స్పందించని అధికారులు


**మందమర్రి, జులై 29, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మందమర్రి పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కామాఖ్య దేవాలయానికి వెళ్లే మార్గం పూర్తిగా జలమయమైంది. ఆలయ మార్గం మధ్యలో ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడంతో భక్తుల రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం భక్తులతో కిటకిటలాడే ఈ దేవాలయానికి వెళ్లే రహదారి మొత్తం వరద నీటిలో మునిగిపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ సమీపంలోని రహదారిపైనే నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భక్తులు ఆలయానికి చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఆలయానికి శాశ్వత రహదారి, వాగుపై కల్వర్టు లేదా వంతెన నిర్మించి భక్తుల ఇబ్బందులను తొలగించాలని ఆలయ పూజారి, భక్తులు విజ్ఞప్తి చేశారు.

## భారీ వర్షాలకు ఇళ్లలోకి పాముల ప్రవేశం..

### - దొరల బంగ్లాలో కొండచిలువ కలకలం

**మందమర్రి, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మందమర్రి పట్టణంలోని దొరల బంగ్లా ప్రాంతంలో ఓ భారీ కొండచిలువ ఇంట్లోకి ప్రవేశించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం, దొరల బంగ్లా ప్రాంతానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతం నుంచి భారీ వర్షాల కారణంగా పాములు తరచూ నివాస ప్రాంతాల్లోకి వస్తున్నాయని తెలిపారు. బుధవారం ఓ వ్యక్తి ఇంట్లోకి భారీ కొండచిలువ ప్రవేశించడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమై స్థానికులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించి కొండచిలువను సురక్షితంగా పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అటవీ ప్రాంతాలకు ఆనుకుని నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాములు లేదా ఇతర వన్యప్రాణులు కనిపిస్తే వాటిని చంపేందుకు ప్రయత్నించకుండా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని స్థానికులు సూచించారు.

## నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు రేపే ఆఖరి గడువు

**కాగజ్‌నగర్ రూరల్,జూలై 29, ప్రభాతవార్త :**

జవహర్ నవోదయ విద్యాలయ 2027-28 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు జూలై 31 చివరి తేదీ అని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న అర్హత కలిగిన విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు రేపే చివరి అవకాశం కావడంతో అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## వర్షాకాలంలో విద్యుత్ భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి

**ఆసిఫాబాద్, జూలై 29, ప్రభాతవార్త :**



వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాల ప్రమాదం అధికంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కుమురం భీమ్ ఆసిఫాబాద్ ఆపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే బుధవారం సూచించారు. వర్షం సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపోయిన, వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకరాదని, తడి చేతులతో విద్యుత్ పరికరాలను ఉపయోగించవద్దని తెలిపారు. గృహాల్లో నాణ్యమైన ఎర్తింగ్, ఐఎస్ఐ ప్రమాణాల విద్యుత్ పరికరాల వినియోగం, పాడైన వైరింగ్‌ను వెంటనే మార్చించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు మోటార్లు, స్టార్టర్లు, పంపుసెట్లకు సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ లైన్ల కింద ఇనుప పైపులు ఎత్తేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపోవడం, ఇతర లోపాలు కనిపిస్తే వాటి దగ్గరకు వెళ్లకుండా వెంటనే టీజీఎస్పీడీసీ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**తాండూర్, జూలై 29, ప్రభాతవార్త :**

సింగరేణి కార్మికుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని గుర్తింపు సంఘం ప్రతినిధులు, జిఎం కమిటీ సభ్యులు కోరారు.గోలేటిలో బుధవారం బెల్లంపల్లి ఏరియా స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జిఎం శ్రీ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం నాయకులు, స్ట్రక్చర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మాదారం, గోలేటి టౌన్‌షిప్‌లలో కార్మికుల సంక్షేమం కోసం రెసిడెన్షియల్ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు.గోలేటి టౌన్‌షిప్‌లోని వ్యాయామశాలలో అధునాతన ఎక్సర్‌సైజ్ పరికరాలను అందుబాటులో ఉంచాలని,గోలేటి క్రాస్ రోడ్, కైరిగూడ శివాలయం ప్రాంతాలలో నూతన బోరింగులు ఏర్పాటు చేయాలన్నారు.బెల్లంపల్లిలోని సింగరేణి క్వార్టర్స్‌లో నివసిస్తున్న ఉద్యోగులకు మందమర్రి ఏరియా తరహాలోనే సమానంగా క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని డిస్పెన్సరీలో లేడీ డాక్టర్ ను నియమించాలని కోరారు.మాదారం డిస్పెన్సరీలో నర్సులు, సిబ్బందిని నియమించాలని, కైరిగూడ గనిలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు మార్చి 2026 నాడే జరగాల్సిన ఏ గ్రేట్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించి, అర్హులైన ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిఎం, ఏరియా అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కైరిగూడ ఓసి పిఓ నరేందర్, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, గోలేటి ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమాకాంత్, ఎస్ఓ టు జిఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహెరా, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పాండు రంగాచార్య, డీజీఎం కిరణ్ బాబు, ఎస్ఈలు సంగోజు శ్రీధర్, కోటయ్య, గడ్డం జ్ఞానేశ్వర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, జిఎం కమిటీ సభ్యులు శేషశయన రావు, జూపాక రాజేష్, జగ్గయ్య, మారం శ్రీనివాస్, ఎం.ఎ.ఆఫ్రిద్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ పులుల దినోత్సవం







విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

**కెరమెరి, జూలై 29, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మండల కేంద్రంలో బుధవారం ఆటవిశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం జూలై 29న అంతర్జాతీయంగా భారతదేశవ్యాప్తంగా ఎంతో పర్యావరణ రక్షణ బాధ్యతతో నిర్వహించబడుతుందని ఎఫ్ఆర్‌వో మజురుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవుల పర్యావరణ వ్యవస్థలో ఆహార గొలుసు యొక్క అగ్రస్థానంలో నిలిచి అమూల్యమైన జీవవైవిధ్యాన్ని కాపాడే పులుల సంతతిని వేటగాళ్ల దాడుల వల్ల, అడవుల నరికివేత వల్ల క్షీ ణించకుండా రక్షించడం జరుగుతుందన్నారు. వాటి సహజ ఆవాసాలను పరిరక్షించడం ఈ అంతర్జాతీయ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. పేర్కొన్నారుభారతీయ పర్యావరణ, వన్యప్రాణి పరిణామ క్రమంలో పులుల సంరక్షణ చర్యలకు అత్యంత ప్రాముఖ్యత ను తెలియజేశారు ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి), జూలై 29, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాఠశాల నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పులుల సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ర్యాలీ అనంతరం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అటవీ శాఖ అధికారులు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సదాశివుడు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, తిరుపతి, సెక్షన్ ఆఫీసర్లు మోహన్, తులసీదాస్, అక్తార్, బీట్ ఆఫీసర్లు అరుణ్‌రెడ్డి, రవీణ, లక్ష్మి, శ్రీలత, శ్రీదేవి, మల్లికార్జున్, ఉపాధ్యాయులు, వాచర్లు తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం

**నిర్మల్, జులై 29, ప్రభాతవార్త:**

జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్షాలు, రక్షణ చర్యలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రెండు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లు, వంతెనల పునరుద్ధరణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. పశుకాపరులు, మత్స్యకారులు, ప్రజలు వాగులు, చెరువులు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లకుండా క్షేత్రస్థాయిలో అడ్డుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల వారీగా వర్షపాతం, నీటిమట్టం వివరాలను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాల వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుధ్య పనులు, ఫాగింగ్, డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు సురక్షి త తాగునీటిని అందించడంతో పాటు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించాలని చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్‌వో రాథోడ్ రమేష్, ఆర్‌డీఓ దేవీదాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డిఎంహెచ్‌ఓ రాజేందర్, డీపీవో శ్రీనివాస్, సీపీవో గంగారెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంఈఓ వాసాల ప్రభాకర్

## ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్ధతులను అమలు చేయాలి

### - మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్

**కాగజ్‌నగర్ రూరల్, జులై 29, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్), కాగజ్‌నగర్‌లో మొదటి దశలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా పద్ధతులను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జకాం ప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్స చంద్రశేఖర్, అమరేందర్‌రెడ్డి, వెంకటరాజయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, సౌకర్యాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని కోరారు.మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణలో ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచే పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నజీర్ అహ్మద్, రిసోర్స్ పర్సన్లు సుందిల్ల రమేష్, జిత్తు నాయక్, జ్ఞానేశ్వర్, శివరాం, మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ మధుకర్, సీసీఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా కలెక్టర్ విస్తృత పర్యటన



- ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రాణహితనది పరిశీలన


- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, జూలై 29, ప్రభాతవార్త

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం చెన్నూరు, కోటపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంస్థల పనితీరును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, విద్య, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. చెన్నూరులో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ప్రహరీ గోడ పనులను తనిఖీ చేసిన కలెక్టర్, పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బీసీ సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కోటపల్లి మండలం అర్జునగుట్ట సమీపంలోని ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలించారు. వరద పరిస్థితులపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వర్షాల వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలో వైద్య సేవలు, మందుల నిల్వలు, పరిశుభ్రతను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధం, తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కనువిందు చేస్తున్న పెద్ద ఊట వాటర్ ఫాల్

తాండూర్, జూలై 29, ప్రభాతవార్త :



తాండూర్ మండలంలోని మాదారంత్రీ ఇంక్లైన్ అటవీ శివారులో గల పెద్ద ఊట వాటర్ ఫాల్ జలకలతో కళకళలాడుతోంది.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దట్టమైన అడవి, గుట్టల మధ్య నుంచి వర్షం నీరు 15 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతూ ఉరకలేస్తోంది.పచ్చని ప్రకృతి మధ్య జాలువారే వాటర్ ఫాల్ సందర్శకులను ఆకట్టుకుంటూ కనువిందు చేస్తోంది.వాటర్ ఫాల్ కు చేరుకోవాలంటే మాదారం త్రీ ఇంక్లైన్ దాటి అటవీ మార్గం గుండా వెళ్లాల్సి ఉంటుంది. వర్షాల కారణంగా వాటర్ ఫాల్ ఉధృతంగా ఉండడంతో సందర్శకులు జాగ్రత్తలు పాటించాలని అటవీ, పోలీసు శాఖ అధికారులు హెచ్చరించారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

బెజ్జూర్,జూలై 29,ప్రభాతవార్త:

బెజ్జూర్ మండల కేంద్రంలోని టీడబ్ల్యూపిఎస్ పాఠశాలలో బుధవారం గురుపూర్ణిమ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం పొందారు.అనంతరం శాలువా కప్పి సన్మానించారు.విద్యార్థుల తల్లిదండ్రులు గురుభక్తి ప్రాధాన్యాన్ని వివరించి మిఠాయిలు పంచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు



## అనాథ పిల్లలకు అండగా మాజీ ఎంఎల్‌ఏ

బెజ్జూర్,జూలై 29,ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలోని రేచిని గ్రామానికి చెందిన ఆదె భీమ్రావు గత సంవత్సరంలో మృతి చెందగా తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.దీంతో వారి పిల్లలు ముగ్గురు అనాథలు అయ్యారని తెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎంఎల్ఏ కోనేరు కోనప్ప బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ,అమ్మాయి చదువు కోసం నెలకు 2000 రూపాయల చొప్పున 50 నెలల పాటు మొత్తం లక్ష రూపాయలను బిఆర్ఎస్ తరఫున స్కాలర్షిప్ అందిస్తామని హామీ ఇచ్చారు.పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానంలో నిలబెట్టాలని కుటుంబ సభ్యులకు సూచించారు.అంతేకాకుండా అమ్మాయి చదువు పూర్తైన తర్వాత వివాహ ఖర్చుల పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని తెలిపారు.పార్టీ తరఫున వీరికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో పాముకాటు కలకలం

నస్పూర్, జూలై 29, ప్రభాతవార్త

నస్పూర్ మండల కేంద్రంలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి బుధవారం పాముకాటు కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కళాశాలలో ఉదయం 8:30 గంటల సమయంలో అల్పాహారం చేసేందుకు విద్యార్థులు డైనింగ్ హాల్‌కు వెళ్తుండగా, ఒక విద్యార్థి కాళ్ల వద్ద పాము కనిపించింది. అది గమనించిన మరో విద్యార్థి తన స్నేహితుడిని కాపాడేందుకు ధైర్యంగా పామును చేతితో పట్టుకుని దూరంగా విసిరేసినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉపాధ్యాయులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఇద్దరు విద్యార్థులను మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. విద్యార్థుల శరీరాలపై స్పష్టమైన పాముకాటు ఆనవాళ్లు కనిపించనప్పటికీ, ముందస్తు జాగ్రత్త చర్యగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం సమాచారం అందించింది. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి సురక్షితంగానే ఉందని సమాచారం.

## నిధుల దుర్వినియోగంపై డీఎల్పీఓ విచారణ

బెజ్జూర్,జూలై 29,ప్రభాతవార్త:



బెజ్జూర్ మండలంలోని ఊట్ సారంగపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం డిఎల్పిఓ హరి ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.గతంలో అందిన ఫిర్యాదుల మేరకు రికార్డులు,అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించి పనుల అమలు తీరుపై ఆరా తీసినట్లు తెలిపారు.సమగ్ర విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎల్పీఓ పేర్కొన్నారు.

## మృతుడికి కుటుంబానికి మున్నూరు కాపు సంఘం పరామర్శ

కాగజ్‌నగర్ రూరల్, జులై 29, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలో నాలుగు రోజుల క్రితం కరెంట్ షాక్‌తో మృతి చెందిన చిట్యాల కేదారి కుటుంబాన్ని బుధవారం మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.బాధిత కుటుంబానికి మున్నూరు కాపు సంఘం తరఫున 25 కిలోల బియ్యం బ్యాగ్‌ను అందజేశారు. కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కష్టకాలంలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని గజ్జల లక్ష్మణ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ తాలూకా అధ్యక్షుడు దెబ్బటి జలపాతి, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, సాయిదామ్ అశోక్, పులిశెట్టి వెంకటేష్, చింతగూడ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం సభ్యులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బురద రోడ్లు రాకపోకలకు అవస్థలు

దహెగాం, జూలై 29,ప్రభాతవార్త :

మండలంలో సోమవారం నుంచి కురుస్తున్న ముసురుకు రోడ్లు బురదమయంగా మారాయి.దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మండల కేంద్రం నుండి కాగజ్ నగర్ కు వెళ్లే ప్రధాన రహదారి డబుల్ రోడ్డు విస్తీర్ణం నిమిత్తం కొత్మీర్ గ్రామం నుండి పెసరికుంట క్రాస్ రోడ్డు వరకు పాత రోడ్డును తొలగించి . మట్టి పోశారు. ఇటీవల కురుస్తున్న ముసురుకు రహదారి బురదమయంగా మారింది వాహనదారులు రాకపోకల సమయంలో అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మారిన పెసరికుంట దగ్గర డబుల్ రోడ్డు

## జాతీయ రహదారిపై అదుపుతప్పి బోలెరో బోల్తా

మందమర్రి, జూలై 29, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారిపై లక్ష్మీ భవాని కాలనీ సమీపంలోని గాంధారి వైన్స్ వద్ద బుధవారం బోలెరో వాహనం అదుపుతప్పి బోర్లాపడిన ఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, మంచిర్యాల వైపు వెళ్తున్న బోలెరో వాహనం అదుపుతప్పి రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోర్లాపడింది. దీంతో వాహనంలో ఉన్న బస్తాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్పందించి అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## విద్యార్థుల నమోదులో రాష్ట్రంలోనే మంచిర్యాల ప్రథమం

### - పీఆర్‌టీయూటీఎస్ అభినందనలు

నస్పూర్, జూలై 29, ప్రభాతవార్త

2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం నిర్దేశించిన విద్యార్థుల నమోదు లక్ష్యాన్ని విజయవంతంగా అధిగమించి, తెలంగాణ రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లా మొదటి స్థానంలో నిలవడం విద్యాశాఖ సమిష్టి కృషికి నిదర్శనమని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ – తెలంగాణ స్టేట్ మంచిర్యాల జిల్లా శాఖ బుధవారం ఒక ప్రకటనలో కొనియాడింది. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాధికారులు, సెక్టోరల్ ఆఫీసర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు, పాఠశాల నిర్వహణ కమిటీలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, దాతలకు పీఆర్‌టీయూటీఎస్ జిల్లా వక్షాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టే శంకర్, బచ్చ మోహన్ రావు అభినందనలు తెలిపారు. వేసవి సెలవుల నుంచే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, డిజిటల్ బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించి నమోదును విజయవంతం చేసిన ఉపాధ్యాయుల అంకితభావాన్ని నేతలు ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే ఉత్సాహంతో విద్యా ప్రమాణాలను మరింత పెంచి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.



## ఇంటింటికి ఆరు మొక్కలు నాటి సంరక్షించాలి

### - పెసరికుంట గ్రామపంచాయతీ సర్పంచ్ సతీష్ కుమ్మరి

దహెగాం, జూలై 29,ప్రభాతవార్త :

మొక్కలను సంరక్షించాలని పెసరికుంట గ్రామపంచాయతీ సర్పంచ్ సతీష్ కుమ్మరి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం నాడు పెసరికుంట గ్రామంలో ప్రతి ఇంటింటికి ఆరు మొక్కలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి మొక్క నాటి సంరక్షించాలని ప్రతి ఇల్లు గ్రామం పచ్చదనంతో కళకళలడుతోందని అన్నారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరు బాధ్యతతో ప్రతి మొక్కని సంరక్షించాలని అన్నారు. గ్రామ కారోబార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా తయారుచేస్తే కఠిన చర్యలు

### - రూరల్ సిఐ కుమారస్వామి

దహెగాం, జూలై 29,ప్రభాతవార్త:

గుడుంబా ఎవరు కూడా తయారు చేయవద్దని కాగజ్‌నగర్ రూరల్ సి ఐ కుమారస్వామి అన్నారు. జిల్లా ఎస్పీ నికితపంత్ ఉత్తర్వు ల మేరకు కాగజ్‌నగర్ డి ఎస్ పి వహీరుద్దీన్ సూచనలతో కాగజ్ నగర్ రూరల్ సి ఐ కుమారస్వామి ఆధ్వర్యంలో మండలంలోని హత్తిని గ్రామపంచాయతీలోని దేవులగూడ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ధరవత్ సాయిరాం ఐదు లీటర్ల గుడుంబా ను స్వాధీనం చేసుకొని వెయ్యి లీటర్ల బెల్లం పానకం ను ధ్వంసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ యువత, గ్రామ ప్రజలు ఎవరు కూడా గుడుంబా తయారు చేయవద్దని, దానిని తాగవద్దని ఆరోగ్యాలు చెడిపోతాయని, గంజాయి జోలికి పోవద్దని సేవించారాదని, స్మార్ట్ ఫోన్ లో వచ్చే తెలియని మెస్సేజ్ ల లింక్ లు ఓపెన్ చేయరాదని, ఎవరికీ కూడా మన ఎటిఎం పిన్ నంబర్స్ ఓటీపీ చెప్పవద్దని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమ లో దహెగాం ఎస్ఐ సిహెచ్ రమేష్, పెంచికల్ పేట్ మండల ఎస్ ఐ అనిల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బెల్లం పానకం ను ధ్వంసం చేస్తున్న పోలీస్ సిబ్బంది

## శ్రీరాంపూర్ సాయిబాబా ఆలయంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

### - ప్రత్యేక పూజల్లో పాల్గొని, అన్నదానం చేసిన మేయర్ ధర్ని మధుకర్, టీపీసీసీ సభ్యుడు నూకల రమేష్



సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుక పాల్గొన్న మేయర్ ధర్ని మధుకర్

నస్పూర్, జూలై 29, ప్రభాతవార్త

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ కొత్త రోడ్డులో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో బుధవారం ఆధ్యాత్మిక ఉత్సాహంతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, టీపీసీసీ సభ్యులు నూకల రమేష్‌లతో కలిసి ఆలయాన్ని సందర్శించి సాయిబాబా వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో మేయర్, నాయకులు పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ.. గురు పౌర్ణమి అనేది ఆధ్యాత్మికతకు, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సాయిబాబా దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేల్పుల రవీందర్, 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చిలుక మల్లేష్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - ఎస్ఐ సిహెచ్ రమేష్,తహసీల్దార్ మునవీర్ షరీఫ్

దహెగాం, జూలై 29,ప్రభాతవార్త :

రానున్న రోజులలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరు కూడా ఇంటి నుండి బయటకు రావద్దని దహెగాం ఎస్ఐ సిహెచ్ రమేష్, దహెగాం తహసీల్దార్ మునవీర్ షరీఫ్ హెచ్చరించారు. వారు మాట్లాడుతూ అత్యవసర పనులుంటే బయటికి వెళ్లాలని అనవసరంగా బయటికి వెళ్ళవద్దని వాగులు, కాలువలు, ఒర్రెలలో నీరు వేగంగా ప్రవహిస్తుందని ఆ ప్రాంతాలకు వద్దకు వెళ్ళవద్దని వాగులలో, చెరువులలో జాలరి వారు చేపల వేటకు వెళ్ళవద్దని అత్యవసర పనులుంటే మినహా ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తల్లిదండ్రులు తమ చిన్నారులను నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తగా పర్యవేక్షించాలని అన్నారు. అన్ని గ్రామాలలో డప్పు చాటింపు చేయడం జరిగిందని తెలియజేయడం జరిగింది.

## భారీ వర్షాలతో ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తం

బెల్లంపల్లి, జూలై 29, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మున్సిపల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని బజార్ ఏరియా, పలు బస్తీలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా భారీ వర్షాల కారణంగా ఇళ్లు కూలిపోయిన బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అలాగే పడిపోయిన చెట్లను, నీరు నిలిచిన ప్రాంతాలను, డ్రైనేజీ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. పట్టణం లోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరి ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో మున్సిపల్ సిబ్బంది నాళాలను శుభ్రపరిచి వరద నీరు నిరవధికంగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. భారీ వర్షాల వల్ల పలు బస్తీలలో నేలకూలిన వృక్షాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు. ఇంకా వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు డ్రైనేజీల పూడికతీత, వరద నీటి మళ్లింపు పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో మున్సిపాలిటీ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. అలాగే భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, ఆయా వార్డుల మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## కంకేట ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

సారంగాపూర్, జులై 29, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు సారంగాపూర్ మండలంలోని కంకేట సర్పంచ్ సాహెబ్ రావు తెలిపారు. బుధవారం కంకేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ద్వారా విద్యార్థులు అభ్యసనా నైపుణ్యాలు పెంచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాదు విజయకుమార్, ఉపసర్పంచ్ కుంటోల్ల లస్మన్న, మాజీ సర్పంచ్ జగదీష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

### - నిర్మల్ జిల్లాలో 98.6 శాతం పూర్తి ఖానాపూర్‌లో వంద శాతం

### - కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్, జులై 29, ప్రభాతవార్త

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లాల అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. డిజిటలైజేషన్‌ను పూర్తి పారదర్శకతతో చేపట్టాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే కేంద్రం పరిధిలోకి తెచ్చేలా రేషనలైజేషన్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో అన్‌కలెక్టెడ్ ఫారాలను మినహాయించి ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 98.6 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో డిజిటలైజేషన్ వంద శాతం పూర్తయిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా అమలు చేస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ సందేహాలు నివృత్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్‌వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చెరువు కాదు.. ఇది ఊరే..!

**- డ్రైనేజీలు లేక చెరువులను తలపిస్తున్న వీధులు - వర్షానికి ఇండ్లలోకి చేరిన వరద నీరు**

**- పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనని గ్రామస్తుల మండిపాటు**



చెన్నూరు, జూలై 29, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని ఆస్నాద్ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి గ్రామంలోని కొన్ని ఇండ్లు జలమయమయ్యాయి. మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో తెల్లవార్లు బిక్కుబిక్కుమంటూ నిద్రలేని రాత్రులు గడిపారు. వర్షాకాలం వస్తే చాలు పదేళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని, అధికారులు మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మారినా సమస్యలు మాత్రం ఇలాగే ఉన్నాయని ఎద్దేవా చేశారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టాలని, లేదంటే ఇండ్లు వదిలి వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. మరికొన్ని వీధులు చెరువులను తలపించేలా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. మండలంలోనే రెండవ పెద్ద గ్రామ పంచాయతీ అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వలన గ్రామం అభివృద్ధిలో వెనుకబడిందని, ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పడేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## బౌద్ధ విహార్‌లో ఘనంగా ఆషాఢ పౌర్ణమి వేడుకలు ప్రారంభం

కాగజ్‌నగర్ రూరల్, జూలై 29, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ పట్టణంలోని తీరందాజ్ థియేటర్ సమీపంలో గల చంద్రమని బౌద్ధ విహార్ మందిరంలో ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వర్షావాస కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు దుర్గం ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ మాణిక్యం, మహిళా మండలి సభ్యులు, కమిటీ సభ్యుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధులు, అంబేడ్కర్‌వాదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమి నుంచి మూడు నెలల పాటు వర్షావాస కార్యక్రమంలో భాగంగా పూజలు, ఉపవాస దీక్షలు నిర్వహించడంతో పాటు బుద్ధుని బోధనలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన అంశాలపై ప్రతిరోజూ అధ్యయనం, పఠనం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. బౌద్ధ ధర్మ చరిత్రలో ఆషాఢ పౌర్ణమి రోజుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఈ రోజునుంచే వర్షావాస కార్యక్రమం ప్రారంభమవుతుందని బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రవీణ్ కుమార్ తెలిపారు.



## ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ శిక్షణ ప్రారంభం

చింతలమానేపల్లి, జూలై 29, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి పి. జయరాజు మాట్లాడుతూ. విద్యా కార్యక్రమాలను ఉపాధ్యాయులు పాఠశాలల్లో సమర్థంగా అమలు చేయాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంతో రాష్ట్రం జాతీయ స్థాయిలో 36వ స్థానం నుంచి 26వ స్థానానికి ఎదగడం ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల్లో అభ్యాస లోపాలను సరిదిద్దేందుకు జరెమిడియేషన్‌చ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వి.పెద్దులు, ఎంఆర్‌పీలు మహేందర్ గౌడ్, సచిన్, సాయి, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపే లక్ష్యం

చింతలమానేపల్లి, జూలై 29, ప్రభాతవార్త:

మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో బుధవారం జజలసిరిచ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిడివో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన జలసంరక్షణ పనులపై చర్చించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంట, ఊట కుంటలు, బోరుబావుల వద్ద రీఛార్జ్ స్ట్రక్చర్స్ ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా కలెక్టర్ నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో షోయబ్ అహ్మద్, ఏపీఎం మోహన్ లాల్, వీవో అధ్యక్షురాలు ప్రమీల, సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



జలసిరి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

## గ్రామాలను పర్యవేక్షించిన చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్

**- వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**

చెన్నూరు, జూలై 29, ప్రభాతవార్త



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ మండల ప్రజలకు సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని పలు గ్రామాల్లో సీఐ బన్సీలాల్ పర్యటించారు. మండలంలోని అక్కెపెల్లి గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాలవాగును ఎమ్మార్వో మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్‌లతో కలిసి పరిశీలించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుపై రాకపోకలు జరగకుండా భారీకేడ్లను ఏర్పాటు చేశారు. అనంతరం మండలంలోని ఆస్నాద్ గ్రామంలోని మంగలి బజార్ లో వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి జేసీబీ సహాయంతో కాలువ తవ్వించి నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెల్లంకొండ సజిత జగన్మోహన్ రావ్, ఉపసర్పంచి ముత్యాల సాయి, పంచాయతీ కార్యదర్శి హరిత, సిబ్బంది పాల్గొన్నారు.




## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**- ఎస్పీ జానకి షర్మిల**

భైంసా, జులై 29, ప్రభాతవార్త:

బాధితులకు సత్వర న్యాయం అందించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బాధితుల ముందే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కుటుంబ వివాదాలపై షీ టీం ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి పలు కుటుంబాలను ఒకటి చేశారు. నిర్మల్ వెళ్లే అవసరం లేకుండా భైంసాలోనే కౌన్సిలింగ్ ఇవ్వడంపై బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్ ఫిర్యాదులను త్వరగా పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు.



## ప్రసూతి విభాగానికి బీపీ అపరేటస్ విరాళం

**- నవ్య క్లినిక్ డా. సతీష్ తోడ్పాటు**

నిర్మల్, జులై 29, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఎంసిహెచ్ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో వైద్య సేవల మెరుగుదలకు స్థానిక నవ్య హియరింగ్ అండ్ స్పీచ్ థెరపీ క్లినిక్ ముందుకు వచ్చింది. క్లినిక్ తరఫున ఈఎన్‌టీ నిపుణులు, ఆడియోలాజిస్ట్ డా. సకినాల సతీష్ మంగళవారం డైమండ్ కంపెనీకి చెందిన అధునాతన బీపీ అపరేటస్‌ను విరాళంగా అందజేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లినిక్ ప్రతినిధులు ఆ పరికరాన్ని ప్రసూతి విభాగం నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్షి  మ్మకి అందజేశారు. ఈ సందర్భంగా క్లినిక్ బృందం మాట్లాడుతూ.. ప్రసూతి విభాగానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు రక్తపోటు పరీక్ష కీలకమని తెలిపారు. కొత్త బీపీ మిషన్ వల్ల త్వరితగతిన పరీక్షలు చేసి సకాలంలో చికిత్స అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డా. సతీష్ ఉదారతను అభినందిస్తూ నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక బాధ్యతతో ఇలా సహకరించడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యత పెరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నవ్య క్లినిక్ సిబ్బంది, ఎంసిహెచ్ నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా యువశక్తి విజయానికి నిదర్శనం

**- కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేందర్**

సారంగాపూర్, జులై 29, ప్రభాతవార్త:

దేశ యువత, విద్యార్థుల ఐక్య పోరాటానికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నిదర్శనమని కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేందర్ తెలిపారు. బుధవారం సారంగాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల స్వరం ఎంత శక్తివంతమైనదో ఈ పరిణామం నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను నిరక్ష్యం చేస్తూ, వారి భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను దేశ యువత సహించదన్నారు. యువత, విద్యార్థి సంఘాల ఆందోళనలతో పాటు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లోనై ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కులు, విద్యా రంగాభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని వివరించారు.



ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిఎం శ్రీ రమేష్



ఖైరిగూడ ఓసిని వ్యూ పాయింట్ నుండి పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

# బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ పర్యటన

**తాండూర్, జులై 29, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియాలో బుధవారంసింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె.వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏరియా జిఎం ఎం.శ్రీరమేష్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కైరిగూడ వ్యూ పాయింట్ నుండి పని స్థలాలను పరిశీలించారు. బొగ్గు నిల్వలు, వర్షాలు కురుస్తున్నందున ఉత్పత్తి, ఉత్పాదకత తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి అధికారులకు సూచనలు చేశారు. గోలేటిలోని విజయ్ పత్ పక్కన మొక్కలు నాటారు. జిఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. గోలేటి, ఏం.వి.కె ఉపరితల గనుల పనుల ప్రగతిని సమీక్షించారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు డైరెక్టర్ సూచించారు. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తిని డైరెక్టర్, జిఎం, అధికారులు శాలులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జిఎం క్వాలిటీ పి వీరభద్ర రావు, కైరిగూడ పిఓ మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఎస్ఓ టు జిఎం రాజమల్లు, గోలేటి ఓసి పిఓ ఉమాకాంత్, ఏరియా సేఫ్టీ అధికారి స్వామి రాజు, మేనేజర్ శంకర్, ఫారెస్ట్ అధికారిణి సుష్మలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అధికారుల అప్రమత్తం

**- మామడ హాబిటేషన్ వాగు పరిశీలన.. ముందస్తు చర్యలకు ఆదేశాలు**

**వేమనపల్లి, జూలై 29, ప్రభాతవార్త**



మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. నీల్వాయి గ్రామపంచాయతీ పరిధిలోని మామడ హాబిటేషన్ సమీపంలోని వాగును బుధవారం ఎంపీడీఓ కుమారస్వామి, ఎంపీఓ వెంకటేష్ పరిశీలించారు. వాగు నీటి ప్రవాహాన్ని పరిశీలించి పరిస్థితిపై స్థానిక సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన అధికారులు, వర్షాల కారణంగా దెబ్బతిన్న లేదా కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్లను వెంటనే గుర్తించి, బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గ్రామ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఇదిలా ఉండగా, నీల్వాయి గ్రామ సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కాలువలు, మోరీలను శుభ్రం చేయించి వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బానోత్ పున్నం నాయక్, వార్డు సభ్యులు, ఎంపీడబ్ల్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కైరిగూడ ఓసిపీకి నాలుగు పురస్కారాలు రావడం అభినందనీయం

**- బెల్లంపల్లి ఏరియా జిఎం శ్రీ రమేష్**

**తాండూర్, జులై 29, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓపెన్ కాస్ట్ (ఓసిపి) ప్రాజెక్టుకు భద్రత వారోత్సవాల సందర్భంగా నాలుగు పురస్కారాలు రావడం అభినందనీయమని ఏరియా జీఎం శ్రీ రమేష్ అన్నారు. కైరిగుడా ఓసిపిలో బుధవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ కైరిగూడ ఓసిపి భద్రత వారోత్సవాపోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి నాలుగు పురస్కారాలు సాధించి సింగరేణి చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఖైది ఓపెన్ కాస్ట్ సురక్షితమైన బొగ్గు ఉత్పత్తిలో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పిందన్నారు. అధికారుల సమన్వయం, కార్మికుల క్రమశిక్షణతో కూడిన శ్రమ ఫలితంగా పురస్కారాలు వచ్చాయన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో సురక్షితమైన ఉత్పత్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి రజిని, కైరిగుడా పిఓ మచ్చగిరి నరేందర్, మేనేజర్ శంకర్, ఏరియా ఇంజనీర్ వీరన్న, ఎస్ఓ టుజీఎం రాజమల్లు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ గౌతమ్ రాజేశ్వర్ రెడ్డి, ఏఐటియుసి గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఓసి ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జిఎం శ్రీ రమేష్

# భారీ వర్షాలతో అప్రమత్తమైన మేయర్..

**మంచిర్యాల, జులై 29, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ హైటెక్ సిటీ ప్రాంతంలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, రహదారులపై ప్రవహిస్తున్న వర్షపు నీటిని ప్రత్యక్షంగా పరిశీలించి పరిస్థితిని అంచనా వేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి, వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక యంత్రాంగాన్ని మోహరించి, సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మేయర్, అక్కడికక్కడే అవసరమైన చర్యలు చేపట్టేలా సూచనలు ఇవ్వడంతో పాటు డ్రైనేజీ నీటి ప్రవాహం సజావుగా కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ పరిశీలనలో మేయర్ వెంట తెరాస రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు నూకల రమేష్, స్థానిక కాంగ్రెస్ నాయకుడు కిషోర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# కోటపల్లి ఆశ్రమ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

**- పర్యావరణ సమతుల్యతకు పులుల సంరక్షణ అత్యంత కీలకం: ఫారెస్ట్ రేంజర్ సదానందం**

**- విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ, పోటీల నిర్వహణ**

**కోటపల్లి, జులై 29 ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడవులు, పులుల ప్రాముఖ్యతను తెలుపుతూ విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ఖఃపులులను కాపాడుకుందాం అడవులను రక్షించుకుందాంగః అనే నినాదాలతో కూడిన ప్లకార్డులు చేతబూని ప్రజలకు చైతన్యం కలిగించారు. ర్యాలీ అనంతరం పాఠశాల విద్యార్థులకు పులుల సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ అనే అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం వంటి వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోటపల్లి ఫారెస్ట్ రేంజర్ సదానందం మాట్లాడుతూ... పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పులులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అడవులు, వన్యప్రాణులను రక్షించుకోవడం ప్రతి ఒక్క పౌరుడి ప్రాథమిక బాధ్యత అని, మన ప్రకృతి సంపదను భావితరాలకు సురక్షితంగా అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమిరెల్లి మధునయ్య, వార్డెన్ భవాని, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పులుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన..

**వేమనపల్లి, ప్రభాతవార్త**




అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా వేమనపల్లి మండలం నీల్వాయి పి.ఎం.శ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ క్షేత్ర అధికారి హఫిజోద్దీన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పులులు అడవుల జీవవైవిధ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వన్యప్రాణులు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పులుల జీవన విధానం, సంరక్షణ అవసరంపై దృశ్య ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం విద్యార్థుల్లో ప్రకృతి, వన్యప్రాణుల పరిరక్షణపై చైతన్యం పెంపొందించిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్ కుమార్, పాఠశాల హెచ్ఎం గిరిధర్ రెడ్డి, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.